# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 22-09-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రపంచ వృద్ధి, శాంతి భద్రతల కోసం ఇండో - పసిఫిక్ దేశాలతో కలిసి పని చేయడానికి భారత్ సిద్ధంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- దేశ అభ్యున్నతి కోసమే ఆర్టికల్ 370ను రద్దు చేశామని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.
- భారతదేశం నుండి అక్రమ రవాణా సహా వివిధ మార్గాల్లో తరలించబడిన 297 పురాతన వస్తువులను తిరిగి ఇవ్వడానికి అమెరికా అంగీకరించింది.
- హంగేరీలోని బుడాపెస్ట్‌లో జరిగిన చెస్ ఒలింపియాడ్ ఓపెన్ విభాగంలో భారత్ బృందం స్వర్ణ పతకాన్ని సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ వృద్ధి, శాంతి, భద్రతల కోసం ఇండో - పసిఫిక్ దేశాలతో కలిసి పని చేయడానికి భారత్ సిద్ధంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారత కాలమాన ప్రకారం ఈ తెల్లవారు జామున న్యూయార్క్ లో జరిగిన క్వాడ్ శిఖరాగ్ర సమావేశాల్లో ప్రధానమంత్రి పాల్గొన్నారని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. ఈరోజు న్యూయార్క్ లో ఆయన మాట్లాడుతూ... డెలావేర్‌లో క్వాడ్ సభ్య దేశాల నాయకులతో ప్రధానమంత్రి వరుస ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారని తెలిపారు. క్వాడ్ సమావేశం భారత్, ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా దేశాలను ఒక చోటికి చేర్చిందని అన్నారు. క్వాడ్ లీడర్స్ సమ్మిట్‌ను 2025లో భారతదేశంలో నిర్వహించాలనే నిర్ణయం పట్ల ప్రధానమంత్రి సంతోషాన్ని వ్యక్తం చేశారని అన్నారు. అలగే క్వాడ్ క్యాన్సర్ మూన్ షాట్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానమంత్రి.. ఇండో - పసిఫిక్ దేశాలకు 40 మిలియన్ల వ్యాక్సిన్ డోస్‌లు అందించి క్యాన్సర్ ను నిరోధించేందుకు తమ వంతు సాయం చేస్తామని హామీ ఇచ్చారని విదేశాంగ కార్యదర్శి వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

హంగేరీలోని బుడాపెస్ట్‌లో జరిగిన 2024 చెస్ ఒలింపియాడ్ ఓపెన్ విభాగంలో భారత్ బృందం బంగారు పతకాన్ని సాధించింది. ఓపెన్ విభాగంలో, పోటీ చివరి రౌండ్‌లో స్లోవేనియాకు చెందిన జాన్ సుబెల్జ్‌పై అర్జున్ ఎరిగైసి విజయం సాధించడంతో స్వర్ణ పతకం భారత్ కైవశమైంది. ర్యాంకింగ్స్‌లో భారత్ 19 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, చైనా 17తో రెండో స్థానంలో, స్లోవేనియా 16 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాయి. కాగా ఈ బృందంలో డి.గుకేశ్, ఆర్.ప్రజ్ఞానానంద, అర్జున్ ఎరిగైసి, విదిత్ గుజరాతీ, పెంటల హరికృష్ణ, శ్రీనాథ్ నారాయణన్ భారత్ కు ప్రాతినిధ్యం వహించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం నుండి అక్రమ రవాణా సహా వివిధ మార్గాల్లో తరలించబడిన 297 పురాతన వస్తువులను తిరిగి ఇవ్వడానికి అమెరికా అంగీకరించింది. వీటిని త్వరలోనే భారత్‌కు రప్పించనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఈ కళారూపాలను తిరిగి ఇవ్వడంలో మద్దతు ఇచ్చినందుకు అధ్యక్షుడు జో బైడెన్‌కు ప్రధాన మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ ఒప్పందం సాంస్కృతిక వస్తువుల అక్రమ రవాణా నిరోధాన్ని బలపరుస్తుందని సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. 2024 జులైలో ఢిల్లీలో జరిగిన 46వ ప్రపంచ వారసత్వ కమిటీ సమావేశంలో సాంస్కృతిక వస్తువులను తిరిగి రప్పించడంపై అమెరికా - భారత్‌ల మధ్య ఒప్పందం జరిగింది. భారత్ నుంచి అమెరికాకి కళాఖండాల అక్రమ రవాణాను నిరోధించడం, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడంలో నిబద్ధతను బలోపేతం చేయాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.

= = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రేపు రాజస్థాన్‌లోని జైపూర్‌లోని సైనిక్ పాఠశాలలను లాంఛనంగా ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా 100 కొత్త సైనిక్ పాఠశాలలను ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా 45 కొత్త సైనిక్ పాఠశాలలకు రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. వీటిని స్వచ్ఛంద సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేట్ పాఠశాలల భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే 33 సైనిక్ పాఠశాలలు పని చేస్తుండగా, ఈ కొత్త పాఠశాలలు, సంబంధిత ఎడ్యుకేషన్ బోర్డులకు అనుబంధం కాకుండా, సైనిక్ స్కూల్స్ సొసైటీ ఆధ్వర్యంలో పని చేస్తాయని తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 114వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

దేశ అభ్యున్నతి కోసమే ఆర్టికల్ 370ను రద్దు చేశామని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈరోజు పూంచ్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభలో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జమ్మూ-కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్‌లో భారీ సంఖ్యలో ఓటర్లు పాల్గొనడంపై ప్రశంసలు కురిపించారు. మొదటిదశ ఎన్నికల్లో 61 శాతానికి పైగా పోలింగ్ నమోదైందని, 30 సంవత్సరాల్లో ఇదే గరిష్ఠమని పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్ లో ప్రజాస్వామ్యం వర్ధిల్లిందన్నారు. అన్ని పొరుగు దేశాలతో భారత్ సత్సంబంధాలను కోరుకుంటుందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ సంకేత భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని భారతీయ సంకేత భాష పరిశోధన, శిక్షణ కేంద్రం రేపు న్యూఢిల్లీలో సంజ్ఞా భాషా దినోత్సవం-2024ను నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ పాల్గొననున్నారు. సంకేత భాషల ద్వారా ఏర్పడే ఐక్యత, భాషా సాంస్కృతిక వైవిధ్యంలో సంరక్షించవలసిన వాటిపై దృష్టి సారించడం ఈ కార్యక్రమ ఉద్దేశ్యం. "సంజ్ఞా భాష హక్కుల కోసం సైన్ అప్ చేయండి" అనే ఇతి వృత్తంతో ఈ సంవత్సరం, అంతర్జాతీయ సంకేత భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

రేపటి నుంచి న్యూ ఢిల్లీలో 2 రోజుల పాటు జరిగే 10వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (CPA) ఇండియా రీజియన్ కాన్ఫరెన్స్‌కు భారత పార్లమెంట్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సదస్సుకు CPA ఇండియా రీజియన్ చైర్‌పర్సన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షత వహిస్తారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 46 మంది ప్రిసైడింగ్ అధికారులు, నలుగురు చైర్మన్లు, 25 మంది స్పీకర్‌లు, ముగ్గురు డిప్యూటీ చైర్మన్‌లు, 14 మంది డిప్యూటీ స్పీకర్‌లు, వారి ప్రిన్సిపల్ సెక్రటరీలు, సెక్రటరీలు, సహచర అధికారులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ఈ సమావేశానికి ముందు CPA ఇండియా రీజియన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరుగుతుంది. 'సుస్థిరమైన, సమ్మిళిత అభివృద్ధి సాధనలో శాసన సభల పాత్ర' అనే అంశంతో ఈ సదస్సు జరుగనుంది. న్యూఢిల్లీలో CPA ఇండియా రీజియన్ సదస్సు జరగడం ఇది 2వ సారి.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ ఖడ్గమృగాల దినోత్సవం సందర్భంగా, ఖడ్గమృగాల రక్షణకు భారతదేశం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. గత అనేక సంవత్సరాలుగా ఖడ్గమృగాల సంరక్షణ ప్రయత్నాలలో నిమగ్నమైన కార్మికులను సామాజిక మాధ్యమం వేదికగా ప్రధానమంత్రి అభినందించారు. భారతదేశం అధిక సంఖ్యలో ఒక కొమ్ము ఖడ్గమృగాలకు నిలయం కావడం గర్వించదగ్గ విషయమని ఆయన అన్నారు. అస్సాంలోని కజిరంగాలో తాను పర్యటించిన విషయాన్ని గుర్తు చేసుకున్న ప్రధానమంత్రి, ప్రతి ఒక్కరూ దానిని సందర్శించాలని కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = =

చెన్నై వేదికగా జరిగిన తొలి టెస్టు క్రికెట్ మ్యాచ్ లో బంగ్లాదేశ్‌పై భారత్ ఈరోజు విజయం సాధించింది. 515 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్ 234 పరుగులకు ఆలౌటైంది. దీంతో భారత్ 280 పరుగుల తేడాతో గెలిచింది. భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మ్యాచ్ ఆఫ్ దీ మ్యాచ్ గెలుచుకున్నాడు. రెండో టెస్టు సెప్టెంబర్ 27 నుంచి కాన్పూర్ వేదికగా ప్రారంభం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా రానున్న మూడురోజులు పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ వర్షాలు ఉత్తర భారతదేశం నుంచి దక్షిణాది వరకు కొనసాగుతాయని తెలిపింది. ప్రస్తుతం యాగీ తుపాను ప్రభావంతో భారత్‌లో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బీహార్, ఝార్ఖండ్, కేరళ, తమిళనాడు, గుజరాత్ సహా కోస్తా రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =